క్లుప్తంగా

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్



యువతికి వ్యాక్సిన్ వేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల: సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్‌తో చెక్ పెట్టవచ్చని ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో జగిత్యాల గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో క్యాన్సర్ మరణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరు వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. 9 ఏళ్ల నుంచి 45 ఏళ్లు వచ్చిన ప్రతీ మహిళ వ్యాక్సిన్ వేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ రాములు

మేడిపల్లి: మండల పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం మెట్‌పల్లి డీఎస్పీ రాములు తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, భవనంలోని వసతులు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. నేరాల నియంత్రణలో చురుకుగా పనిచేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి పోలీస్ డిపార్ట్‌మెంట్ విలువలను పెంపొందించాలన్నారు. గణేష్ నవరాత్రులు, లోకల్ బాడీస్ ఎన్నికల్ల విధులు నిర్వహించేందుకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. బ్లూకోల్ట్ – పెట్రో కారు విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేశ్ బాబు, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కోరుట్ల ఎస్సై చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బల్దియా కమిషనర్

రాయికల్: పట్టణంలోని 10, 12 వార్డుల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకట్, వార్డు అధికారులు రజాక్, గంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రోడ్డు మరమ్మతు



మట్టి పోసి చదును చేయిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: భూషణరావుపేట నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కోనాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు బురదతో అధ్వానంగా మారగా, దాతల సహకారంతో శుక్రవారం రోడ్డును మరమ్మతు చేశారు. భూషణరావుపేట శివారులో రోడ్డుపై బురద చేరడం, బైకులు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో పలువురు కలిసి డబ్బులు జమచేసి బురద ఉన్న చోట మట్టిని పోసి ట్రాక్టర్‌తో చదును చేశారు. రాకపోకల సమస్య తీరిందని రెండు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు.

అడవులను రక్షించాలి



సారంగాపూర్: అడవులను రక్షించడానికి ప్రజలు సహకరించాలని అటవీశాఖ రేంజర్ పద్మారావు అన్నారు. శుక్రవారం మండలంలోని నాగునూర్ అటవీప్రాంతంలో అటవీశాఖ అధికారులు ప్లాంటేషన్ ఏర్పాటు పనుల్లో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి సాంబయ్య, బీట్ అధికారులు నరేష్, దేవేందర్, ఫీల్డ్‌అసిస్టెంట్ మల్లేశ్ ఉన్నారు.

అభివృద్ధి నిధులు మంజూరెప్పుడో?

- రూ.15 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు
- వార్డుల్లో అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు

మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీలో నిధుల కొరతతో మౌలిక వసతుల కల్పన జరగడం లేదు. కొంతకాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన విధంగా నిధులు మంజూరు కావడం లేదు. దీనివల్ల వసతులు సమకూరక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా పలు వార్డుల్లో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. వానాకాలంలో చిన్నపాటి వర్షాలకే ఈ రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. మరోవైపు డ్రైనేజీలను నిర్మించకపోవడంతో మురుగు నీరంతా రోడ్లపైకి గానీ, ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ ప్లాట్లల్లోకి గానీ వచ్చి చేరుతోంది. ఈ సమస్యలతో దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల వ్యాప్తికి కారణమవుతోంది.



‘గుంతలమయమై పిచ్చి మొక్కలతో నిండి ఉన్న ఈ రహదారి పట్టణంలోని 12 వార్డులోనిది. దీనిని సీసీగా మార్చకపోవడంతో ఇలా అధ్వానంగా ఉంది. దీనికి తోడు డ్రైయినేజీ లేకపోవడంతో చుట్టూ పక్కల ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఈ రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈ మార్గం మీదుగా నడవలేని పరిస్థితి నెలకొంటుంది. రోడ్డు, డ్రైయినేజీని నిర్మించాలని స్థానికులు పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.’

రూ.15కోట్ల నిధులకు ప్రతిపాదనలు..

- ➡ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీకి పెద్దగా నిధులు మంజూరు కాలేదు. దీనివల్ల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.
- ➡ ఇటీవల రూ.15 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు జారీ చేసింది.
- ➡ ఆ మేరకు ప్రతి వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం కోసం అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశారు.
- ➡ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం మౌలిక వసతుల కోసం రూ.10 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.
- ➡ ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఈ నిధులకు బ్రేక్ పడింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అసెంబ్లీ సమావేశాల్లో పలుమార్లు ఈ నిధుల గురించి ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు.
- ➡ వాటి స్థానంలో అధికారులు కొత్తగా ప్రతిపాదనలను అందజేశారు. ప్రస్తుతం ఆ నిధులు మంజూరైతే వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి అవకాశముంటుంది.

త్వరలో మంజూరయ్యే అవకాశం

ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.15 కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపించాం. దీనిలో ఎక్కువ నిధులు సీసీ రోడ్లు, డ్రైయినేజీలకు కేటాయించాం. తొందరలోనే ఈ నిధులు మంజూరయ్యే అవకాశముంది. అవి రాగానే వార్డుల్లో పనులను చేపడుతాం.

–నాగేశ్వర్‌రావు, డీఈఈ







రాయికల్, కోరుట్ల, పెగడపల్లిలోని పలు ఆలయాల్లో సామూహిక కుంకుమపూజలు, వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల టౌన్/మెట్‌పల్లి/రాయికల్/ పెగడపల్లి/మల్లాపూర్: వరలక్ష్మీ వ్రతం వేడుకలు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మహిళలు ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలు, నోములతో ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరుపుకున్నారు. అమ్మవారికి గాజులు సమర్పించి పసుపు, కుంకుమలు పెట్టి పూజించి, భక్తిని చాటుకున్నారు. వ్రతాలు జరుపుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



మల్లాపూర్ శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో పూజలు

పదేళ్ల తర్వాత గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం

సారంగాపూర్: తెలంగాణలో పదేళ్ల తర్వాత గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద ప్రజల్లో ఆనందం కనిపిస్తుందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అర్పపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం చేపట్టే లబ్ధిదారుల భూమి పూజలో పాల్గొన్నారు. గత ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పేరుతో గ్రామాల వరకు ఆ పథకాన్ని విస్తరించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5లక్షలతో పేదల కోసం పార్టీలకతీతంగా ఇళ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆయన వెంట నాయకులు పొలాసనందం, బేతి పూర్ణచందర్‌రెడ్డి, అప్పం స్వామి తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇల్లు భూమిపూజలో జీవన్‌రెడ్డి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల: మండలంలో ఇటీవల పలువురు మృతి చెందగా, బాధిత కుటుంబాలను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శుక్రవారం రాత్రి పరామర్శించారు. ఆయన వెంట బత్తిని శ్రీనివాస్ గౌడ్, దారం ఆదిరెడ్డి, ముత్యం శంకర్, శనిగరపు తిరుపతి, సంత ప్రకాశ్ రెడ్డి, రామగిరి మురళీ, అల్లూరి రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి

ప్యాక్స్ చైర్మన్‌కు ఎమ్మెల్యేల పరామర్శ

కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి గ్రామనికి చెందిన కాంగ్రెస్ లీడర్ ప్యాక్స్ చైర్మన్ రాజ నర్సింగ రావు తల్లి ప్రేమలత(68) బుధవారం రాత్రి హత్యకు గురికాగా, రాజనర్సింగ రావును శుక్రవారం జగిత్యాల ఎమెల్యే సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వేర్వేరుగా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

యాదవుల హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

కథలాపూర్: యాదవులకు జనాభా ప్రకారం రావాల్సిన హక్కుల సాధనకు ఉద్యమిద్దామని ఆ సంఘం జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు గానవేని మల్లేశ్ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కథలాపూర్ మండలం తాండ్ర్యాలలో యాదవ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ రాజకీయాల్లో ప్రాధాన్యత లేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులు చైతన్యంగా ఉండి బరిలో ఉండాలన్నారు. గ్రామంలో 101 మంది సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు బొడ్డు బాలు, జెల్ల వేణుగోపాల్, బర్ల మధు, రంజిత్ యాదవ్, బైకని మధు, మంచాల మహేశ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందిస్తున్న మల్లేశ్‌యాదవ్

భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో

ఇబ్రహీంపట్నం: భూ భారతి దరఖాస్తులనుపరిష్కరించాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించారు. ఒకొక్క ఆర్ఐకి ఎన్ని గ్రామాలు ఉన్నాయి, వారికి ఎన్ని దరఖాస్తులు వచ్చినాయి, ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరించారు.దరఖాస్తులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. మండలంలో 1466 దరఖాస్తులు రాగా ఇప్పటికే గ్రామపంచాయతీలకు నోటీసులు జారీ చేశామని ఇందులో 34 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిష్కారం కోసం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 14 వరకు భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు తరలిరావాలి

సారంగాపూర్: ఈ నెల 13న జగిత్యాల జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు ప్రతి గౌడ కులబాంధవుడు తరలిరావాలని గౌడ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. శుక్రవారం సారంగాపూర్‌లో గౌడ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మోత్కూరి ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సారంగాపూర్ లో విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించారు. సమావేశంలో గౌడ సంఘం ప్రతినిధులు మోత్కూరి ప్రసాద్ గౌడ్, తోడేటి శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నవనాగ, మానసాదేవి విగ్రహాలకు పుణ్యహావచనం

కోరుట్ల: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో నూతన నవనాగ మానసాదేవి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పుణ్యాహవచనం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. ఆదివారం నవనాగ, మానసాదేవి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామిల విగ్రహాలను ప్రతిష్టించనున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బాలె నర్సయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు దంపతులు, నాయకులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

జగిత్యాల/ధర్మపురి: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న గోలి శ్రీలత, కెమిస్ట్రీ అధ్యాపకురాలు నీలి వాసవిలకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఉత్తర్వులు జారీ చేసినట్లు మహిళడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. వీరిని పలువురు అభినందించారు.

పంటలకు నానో ఎరువులు వాడాలి

ధర్మపురి: పంటలకు రసాయనిక ఎరువులను తగ్గించి వాటికి ప్రత్యామ్నాయంగా నానో ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. శుక్రవారం ధర్మపురిలోని రైతు వేది కలో వ్యవసాయశాఖ ఏఈవోలు, సహకార సంఘాల కార్యదర్శులు, రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించారు. అధికారుల సూచనల మేరకే రైతులు రసాయన ఎరువులు వాడాలన్నా రు. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఏడీఏ రాంచంద్రం, జిల్లా ఇఫ్కో మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఈ పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి

బుగ్గారం: ఈ పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని డీఏవో భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం బుగ్గారం మండలంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ముందుగా పీఏసీ ఎస్ ఎరువుల గోదాములో స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కుల ను పరిశీలించారు. ప్రతీ రైతుకు ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియా ఇవ్వాలని సూచించారు. ఏవో అక్షిత, సిబ్బంది పాల్గొన్నారు.



పెగడపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి యాపల్ చెరువు వెళ్లే తారు రోడ్డు గుంతలమయంగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం రూ. 2 కోట్లతో నిర్మాణం జరిగిన ఈ తారు రోడ్డుకు మరమ్మతులు లేక అస్తవ్యస్తంగా మారింది. రోడ్డును మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ, సెల్ నంబర్ : 9440818090

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ముందస్తు రాఖీ వేడుకలు



రాయికల్ ఠాణాలో రాఖీ వేడుకల్లో విద్యార్థులు



కోరుట్ల ఎంపీడీవోకు రాఖీ కడుతున్న విద్యార్థులు

జగిత్యాల/కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/మెట్‌పల్లి: ప్రేమ అనుబంధాలకు ప్రతీక రాఖీ పండగ అని అదనపు కలెక్టర్ లత అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టీఎన్జీవో ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ముందస్తుగా రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల, రాయికల్, కోరుట్ల పట్టణాల్లోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

జగిత్యాల: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు అన్నారు. శుక్రవారం కార్యాలయంలో మాట్లాడుతూ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, లేనిచో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్‌యూ కన్వీనర్ వెంకటేశ్, ఆర్యన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

రాయికల్: ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో చిరంజీవి సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపేటలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. ఆయన వెంట గ్రామ నాయకులు ఉన్నారు.

లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు దక్కాలి

మల్లాపూర్: ప్రభుత్వ పథకాల లబ్ధి అర్హులైన నిరుపేదలకే చేరాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రాఘవపేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, బీఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు మ్యాకల సతీష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఊడిన లారీ చక్రాలు

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై శుక్రవారం జగిత్యాల నుంచి కరీంనగర్‌వైపు వెళ్తున్న జగిత్యాలకు చెందిన బోర్‌వెల్ లారీ వెనక చక్రాలు ఊడిపోయాయి. దీంతో లారీ రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్, కానిస్టేబుల్ జనార్దన్ ,హోంగార్డు నర్సింగరావు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం

కోరుట్ల: పట్టణ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండా కిషన్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా సుదవేణి రవిగౌడ్,కార్యదర్శిగా కుంట రాజు గౌడ్, కోశాధికారిగా పడాల ప్రకాష్ గౌడ్ లను ఎన్నుకున్నారు.ఎన్నికల నిర్వాహకులుగా తూడూరి సతీష్ గౌడ్, యాగంట్ల గంగాధర్‌గౌడ్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పడాల నారాయణ గౌడ్, కుంటా నారాయణ గౌడ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులుదీరిన రైతులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల ఎక్స్ రోడ్డులో ఆగ్రోస్ సెంటర్ వద్ద యూరియా బస్తాల కోసం శుక్రవారం రైతులు బారులు తీరారు. యూరియా నిల్వలు తక్కువగా ఉన్నాయని భావించి ఆగ్రోస్ సెంటర్ వద్దకు తాండ్ర్యాల, పోతారం, ఇప్పపెల్లి గ్రామాల రైతులు అధికసంఖ్యలో చేరుకున్నారు. యూరియా బస్తాలు దొరుకుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందారు. పంటలకు సరిపడేలా యూరియా బస్తాలు రెండు రోజుల్లో వస్తాయని ఏవో యోగితా రైతులకు సర్దిచెప్పారు. పంటలకు సరిపడేలా యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

మల్యాల: దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందిన వలస జీవి కుటుంబానికి ముత్యంపేట ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. మల్యాల మండలం ముత్యంపేటకు చెందిన బూస అంజయ్య ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి, గుండెపోటుతో అక్కడే మృతిచెందగా, ముత్యంపేట ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి మల్లేశం, సభ్యులు బొమ్మకంటి మహేశ్, బాలె వంశీ, గుండేటి సంజీవ్, బాలె పరమేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మల్యాల: మండలంలోని మల్యాల,తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దయానంద్ తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.